క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

మొయినాబాద్: మండల పరిధిలోని రెడ్డిపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. దీనికి గ్రామ సర్పంచ్ వినిత కరుణాకర్, ఎంపీటీసీ మోర శ్రీనివాస్‌లు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ రాంచందర్, నాయకులు శ్రీనివాస్, కుమార్, శ్రీనివాస్ చారి, శేఖర్, నవీన్, యాదయ్య, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు నేడు(సోమవారం) కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి జనార్దన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ధర్నా కార్యక్రమం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ధర్నా కార్యక్రమానికి రిటైర్డ్ పెన్షనర్స్ అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

పూలే జీవితం ఆదర్శం

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్



రమణారెడ్డికి పూలే చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

చేవెళ్ల: మహాత్మాజ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని ఆయన అడుగుజాడల్లో నడవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజేశ్ అన్నారు. మహాత్మాజ్యోతిరావు పూలే ఫొటో ప్రతి కార్యాలయంలో ఉండేలా ఆయన చిత్రపటాలను అందించేందుకు పీడీఎస్‌యూ నిర్ణయించిందని చెప్పారు. ఆదివారం చేవెళ్లలోని పలు వసతిగృహాల్లో ఈ ఆయన చిత్రపటాలను ఆ సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 11వ తేదీన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశాడని గుర్తు చేశారు. 1873 సెప్టెంబరు 24న పూలే తన అనుచరులతో కలిసి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్య శోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో అన్ని కులాల మతాల ప్రజలు చేరవచ్చునని చెప్పారు. దేశంలో పూలే, అతని భార్య సావిత్రిబాయి పూలే మహిళా విద్యకు మార్గదర్శకులుగా నిలిచారన్నారు. బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించినట్లు చెప్పారు. వితంతువుల కోసం ఒక ఆశ్రమాన్ని స్థాపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అఖిల్, సంతోష్, శ్రీను, ప్రభాష్, రాజు ఉన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



సర్టిఫికెట్లను అందజేస్తున్న ఉపాధ్యాయిలు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని భిక్ష ప్రభుత్వ కళాశాల ఉపన్యాసకులు రాధాకృష్ణ అన్నారు. పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీలో గల క్రిష్ణవేణి పాఠశాలలో ఆదివారం ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా ఆధ్వర్యంలో విద్యార్థులకు స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాధాకృష్ణ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను ఉపాధ్యాయులను, పెద్దలను గౌరవిస్తూ వారికి విధేయులుగా ఉండాలన్నారు. అనంతరం రఫత్‌సుల్తానా మాట్లాడుతూ.. స్నాతకోత్సవ వేడుక విద్యార్థుల సంవత్సరాల కృషి, అంకిత భావానికి నిదర్శనంగా సూచించే స్మారక సందర్భం అన్నారు. ఈ వేడుక చిన్నారులలో నూతనోత్తేజాన్ని నింపుతుందని చెప్పారు. అనంతరం పూర్వ ప్రాథమిక స్థాయి(ఎల్‌కేజీ, యూకేజీ) విద్యను పూర్తి చేసుకొని ప్రాథమిక స్థాయిలోకి అడుగు పెడుతున్న విద్యార్థులకు, ప్రాథమిక స్థాయిని(5వ తరగతి) పూర్తి చేసుకొని ఉన్నత స్థాయి విద్యాభ్యాసంలోకి అడుగు పెడుతున్న విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టాలు తీరేనా?

- సకాలంలో అందని వేతనాలు
- చివరికి అప్పులపాలు



కొందుర్గు మండలం ముట్పూర్‌లో చెత్త సేకరిస్తున్న కార్మికుడు

కొందుర్గు: ప్రతినిత్యం నిద్ర లేవగానే పారిశుద్ధ్య కార్మికులు వీధులన్నీ శుభ్రం చేస్తారు. అమ్మా.. చెత్తబండి వచ్చింది.. చెత్తెయ్యండి..తడి, పొడిచెత్త వేరుచేసేయండమ్మా..అంటూ ఇల్లిల్లు తిరిగి చెత్తను సేకరించి ఊరుబయట ఉన్న డంపింగ్ యార్డులో వేస్తారు. ముక్కుకు వాసన వస్తుందని అందరు పక్కకు వెళితే ఆ మురుగు కాల్వలనే శుభ్రం చేసి ప్రజలకు దోమలు, ఈగలు కాటువేయకుండా కాపాడి రోగాల బారిన పడకుండా చూస్తారు. అలాంటి పారిశుద్ధ్య కార్మికులకే నెలవారి వేతనాలు సకాలంలో అందక అవస్థలు పడుతున్నారు. దీంతో వారు కుటుంబ అవసరాల కోసం దొరికిన చోటల్లా అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారు. ఇక పనుల విషయానికొస్తే ఇటు సర్పంచ్ అటు ఉపసర్పంచ్‌తో పాటు గ్రామానికి హాజరయ్యే ప్రతి అధికారి, నాయకులు పనులు చెపుతారని కార్మికులు వాపోతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేయడంతో పాటు, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ తామే శుభ్రం చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా శుభ్రం చేస్తున్నామని అంటున్నారు. అధికారులు స్పందించి తమకు ప్రతినెల సకాలంలో వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్మికుల వివరాలు ఇలా..

ప్రభుత్వం గ్రామంలో ప్రతి 500 జనాభాకు ఒక కార్మికుడిని నియమించింది. వీరికి నెలకు రూ. 8500 చెల్లించాలి. ఈ లెక్కన రంగారెడ్డి జిల్లాలోని 21 మండలాలు, 550 గ్రామపంచాయతీలకు సంబంధించి దాదాపు 1200 మందికి పైనే కార్మికులు పనిచేస్తున్నారు. వీరిని ప్రభుత్వం మల్టిపర్పస్ వర్కర్లగా గుర్తిస్తూ గ్రామంలో చెత్తను శుభ్రం చేయడం మొదలుకొని చెట్లకు నీళ్ల పోసేవరకు అన్ని సేవలను వినియోగించుకుంటుంది.

నెలకు రూ. 26 వేలు ఇవ్వాలి



గ్రామపంచాయతీ కార్మికులకు 29 కార్మిక చట్టాలను వర్తించేలా చేయాలి. నెలకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలి. ప్రతినెల క్రమం తప్పకుండా వేతనం అందించాలి. ప్రస్తుత జనాభా ప్రాతిపదికన కార్మికులను అదనంగా నియమించాలి కార్మికులతో అదనపు పనులు చేయించకూడదు. – గోపాల్, సీపీఐ మండల కార్యదర్శి

వేతనాల చెల్లింపునకు ఇబ్బంది లేదు

కార్మికుల వేతనాల కోసం గ్రామపంచాయతీ ఖాతాల్లో డబ్బులు నిల్వ ఉన్నాయి. కొన్ని సందర్భాల్లోఓ ఎస్‌టీలో ఫ్రీజ్ ఉంటే లావాదేవీలు నిలిచిపోతాయి. ప్రస్తుతం జనవరి, ఫిబ్రవరి, మార్చి వేతనాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.
– లాలయ్య, ఎంపీఓ కొందుర్గు

ఊరూరా ‘బలగం’ సినిమా

చిత్రం చూసి కంటతడి
- ప్రజాప్రతినిధులతో కలిసి వీక్షించిన ప్రజలు



బలగం సినిమాను చూస్తున్న గ్రామస్తులు

షాబాద్: మానవ విలువలు మరిచి, స్వార్థాలతో, ద్వేషాలతో చిన్న చిన్న గొడవలకు దూరమవుతున్న బంధాలకు బలగం సినిమా కనువిప్పు కలిగిస్తోంది. మండల పరిధిలోని రుద్రారం, దేవునిగడ్డ, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, పెద్దవేడు, సర్దార్‌నగర్, కుమ్మరిగూడ తదితర గ్రామాల్లో నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో బలగం సినిమాను ప్రజలతో కలిసి వీక్షించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... మానవత విలువలు మరిచి దూరమవుతున్న కుటుంబాలు ఈ సినిమా చూస్తే కలవాలనే ఆలోచన వస్తుందని బలగం మూవీని అందరికి చూపించాలనే ఆలోచన చేసి సినిమాను ప్రదర్శించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. దాదాపు 1000 నుంచి 1500 మంది వరకు గ్రామస్తులు, ప్రక్క గ్రామాల నుంచి ప్రజలు అధికంగా తరలి వచ్చి బలగం సినిమాను చూసి కన్నీరు పెట్టారు. బలగం సినిమా ప్రతి ఒక్కరు కంటతడి పెట్టించిందని తెలిపారు. కార్యక్రమంలో రుద్రారం సర్పంచ్ బండ స్వర్ణలత, బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణారెడ్డి, సతీష్‌యాదవ్, రమేష్, కృష్ణ, మల్లేష్, మహేందర్‌రెడ్డి, నర్సింహులు తదితరులున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని వినాయక గంజ్ ఆవరణలో ఉన్న గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో కౌన్సిలర్ ఈశ్వర్ రాజు, కోఆప్షన్ సభ్యుడు ఒగ్గుకిషోర్, గ్రంథాలయ కమిటీ వైస్ చైర్మన్ మహేశ్వర్, నాయకులు శేరివిష్ణువర్ధన్‌రెడ్డి, మహావీర్ లాహోటీ, సత్యనారాయణ, గోపాల్, ప్రకాష్, కృష్ణయ్య, శ్రీనివాస్, వినోద్, శ్రీకాంత్, శంకర్‌లాల్ లాహోటీ, భగవాస్ దాస్ మలానీ, గజానంద్, చగన్ మలానీ, కోటిలింగం గౌడ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పండుగలు జరుపుకోవాలి



ఈస్టర్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: పండుగలను ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. ఆదివారం ఈస్టర్ పండుగ సందర్భంగా కనకమామిడి గుట్టపై ఉన్న చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళి సంక్షేమం కోసం క్రీస్తు పునరుద్ధరణ పొందిన పవిత్రమైన రోజే ఈస్టర్ పర్వదినం అన్నారు. క్రైస్తవులందరికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈస్టర్ వేడుకలు కనకమామిడి గుట్టపై నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఎంపీటీసీ ప్రభావతిగణేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎంఎస్ రత్నం, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు జీవంతు, మైసని రవి తదితరులు పాల్గొన్నారు.

‘ఇంటింటికీ సీపీఐ’ని విజయవంతం చేయండి

పాంజిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

షాబాద్: ‘మోదీ హఠావో దేశ్‌కో బచావో’ నినాదంతో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం ఏప్రిల్ 14 నుంచి మే 15వరకు సీపీఐ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నాడని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నాడని మండిపడ్డారు. భారతదేశ నల్లధనాన్ని విదేశీ బ్యాంకులలో పెట్టుకొని అనుభవిస్తున్న వారి నుంచి నల్లధనాన్ని తెచ్చి భారతదేశ అభివృద్ధికి ఉపయోగ ఇస్తానని చెప్పిన మోదీ నల్లధనాన్ని తేలేక తెల్లమొహం వేశాడని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయాన్ని అప్పజెప్పే కుట్ర చేస్తున్నాడని చెప్పారు. ఏప్రిల్ 14 నుంచి జరిగే ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి నక్కలి జంగయ్య, సహాయ కార్యదర్శి రుక్కయ్య, నాయకులు రాములు, శ్రీశైలం, పోచయ్య, నారాయణ, మధు, శేఖర్ తదితరులున్నారు.



షాబాద్: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జంగయ్య తదితరులు



చేవెళ్ల: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బీజేపీ కో హఠావో దేశ్‌కో బచావో

చేవెళ్ల: ఈనెల 14వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఇంటింటికి సీపీఐ కార్యక్రమం చేపట్టి ప్రజలకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తెలియజేయాలని పార్టీ నిర్ణయించిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. రామస్వామి అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఇంటింటికి సీపీఐ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ‘బీజేపీకో హఠావో దేశ్ కో బచావో’ పేరుతో దేశ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమంతో ప్రజల వద్దకు వెళ్లనున్నట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లి ప్రధాన మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం విధానాల వల్ల దేశంలో వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను దేశ సమైక్యత సమగ్రతకు వాటిల్లే ప్రమాదాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. దేశంలో ప్రమాదకర పాసిస్ట్ నిరంకుశ హిట్లర్ తరహా పాలన అందిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. దీనికి వామపక్ష ప్రగతిశీల, లౌకిక , ప్రజాస్వామ్య శక్తులతో కూడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలను చైతన్య పరిచే పాదయాత్రలను, ప్రజాపోరు యాత్రలను, వివిధ రూపాల్లో చేపట్టి ప్రతి గ్రామం సందర్శించాలని సీపీఐ జాతీయ సమితి పిలుపునిచ్చిందన్నారు. దీనికి పార్టీ నాయకులు కార్యకర్తలు అంతా కలిసి సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభులింగం, సుధాకర్, సుభాన్ రెడ్డి, ఎండీ మక్బుల్, సత్యనారాయణ, సత్తిరెడ్డి, అంజయ్య, మల్లేశ్, కృష్ణగౌడ్, శివ, మంజుల, మాధవి, విజయమ్మ, సాయిలమ్మ, మీనాక్షి ఉన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కొత్తూరు: వ్యాపారులు, ప్రజాప్రతినిధులు సామాజిక, సేవా కార్యక్రమాలను చేపట్టే విధంగా సేవాగుణం అలవార్చుకోవాలని టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కొత్తూరు పట్టణంలోని పెంజర్ల రోడ్డులో ఆదివారం స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారి రామకృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అత్యవసర పనులు ఉంటేనే బయటకు రావాలన్నారు. తప్పనిసరిగా బయటకు వెళ్లే వారు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వడదెబ్బకు గురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్సలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాదారం నర్సింహ్మాగౌడ్, నాయకులు శ్రీను, కృష్ణగౌడ్, శ్రీను, విష్ణుమూర్తి, జనార్దన్‌రెడ్డి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయండి

జాతర కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు జాంగారి రవి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పరిషత్ గ్రౌండ్‌లో నిర్వహించే పూలే అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయాలని జాతర కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు జాంగారి రవి కోరారు. ఆదివారం జాతరకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ..దళిత బహుజనులకు ఏప్రిల్ మాసం పవిత్రమైన మాసం అని అన్నారు. ఏప్రిల్ 5న భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం జయంతి, ఏప్రిల్ 11న మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి, ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతులను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మహనీయుల జయంతులను పురస్కరించుకొని ఈనెల 29న మహబూబ్‌నగర్‌లో నిర్వహించ తలపెట్టిన పూలే అంబేడ్కర్ జాతరకు దళితులందరు తరలిరావాలన్నారు. మహనీయుల ఆలోచనల విధానాలను, వారి చరిత్రను ప్రజలకు వివరించేందుకు జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతర కమిటీ నాయకులు జంగయ్య, కర్రె కృష్ణయ్య, సూర్యనాయక్, శ్రీను పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ సిద్ధం.. ప్రారంభమే ఆలస్యం

కొడంగల్: పట్టణ శివారు బీసీ,ఎస్సీ వసతి గృహాల సమీపంలో కోస్గి రహదారి పక్కన నిర్మించిన బస్ షెల్టర్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చొరవతో ఏసీడీపీ నిధులు రూ.15 లక్షలు వెచ్చించి.. కొడంగల్ నుంచి కోస్గి మహబూబ్‌నగర్‌కు వెళ్లే రహదారి పక్కన ఈ షెల్టర్‌ను నిర్మించారు. ఆర్యనగర్, మిట్టిబౌలి, జులైవాడ, ఇస్లాంపుర తదితర కాలనీవాసులకు ఈ షెల్టర్ అనుకూలంగా ఉంటుంది. మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు చెప్పారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూరు: జనావాసాల్లో రక్షణ కంచెలు లేకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో మూగజీవాలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. కొత్తూరు పట్టణంలో ప్రమాదభరితంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి ట్రాన్స్‌కో అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కొత్తూరు నుంచి పెంజర్లకు వెళ్లే ప్రధాన రోడ్డులో నారాయణగూడ కాలనీ వద్ద రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ సమీపం నుంచే విద్యార్థులు, వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఏమాత్రం ఆజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు గురయ్యే అవకాశం పొంచి ఉందని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు.



ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వారాంతపు సెలవులు అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

శంకర్‌పల్లి: మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వారాంతపు సెలవులను ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాల్వల్లో, చెత్తా చెదారంలో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు దుస్తులు, నాణ్యమైన సబ్బులు, బూట్లను, శానిటైజర్లను అందించడంలో అధికారులు విఫలయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారికి కావాల్సిన వసతులను సమకూర్చాలని డిమాండ్ చేశారు. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందిస్తున్న విధంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.21వేలు అందించాలని కోరారు. కాగా, 5లక్షల ప్రమాద బీమా పథకాన్ని కూడా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు రమేష్, కోశాధికారి రాములు, ఉపాధ్యక్షుడు శాంతయ్య, కృష్ణ, సభ్యులు లక్ష్మి, రాజు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న దేవేందర్

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

పరిగి: బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సత్యసాయి సమితి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, బాటసారులు, ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పూడూర్ జెడ్పీటీసీ మేఘమాల, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్, రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరుద్యోగులకు అన్యాయం



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వైఎస్సార్‌టీపీ నేత ఇబ్రహీం

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థుల ఆత్మబలిదానాలతో సాధించుకున్న తెలంగాణ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరితో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఎండి.ఇబ్రహీం అన్నారు. పట్టణంలోని ముఖ్యకూడలిలో ఇబ్రహీం ఆధ్వర్యంలో ఆదివారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.91లక్షల ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని బిస్వాల్ కమిటీ చెపుతుండగా కేసీఆర్ 80వేల ఖాళీలు మాత్రమే ఉన్నాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకుతో లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. ఉద్యోగాలను సంతలో సరుకుల్లా అమ్ముకుంటున్నారని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. నిరుద్యోగ భృతి కింద రూ. 3016 చెల్లించాలని, అలాగే, స్వయం ఉపాధిని కల్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలను అందజేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శీలం శ్రీను, నాయకులు ఇసాక్, నర్సింలు, గోపినాయక్, రవి, భిక్షపతి, ఫైజుస్అలీ, సాయికృష్ణ, మల్లేష్, ఇలియాస్, ప్రశాంత్, శ్రీను, రాము, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

50 ఏళ్ల తరువాత కలుసుకున్న బాల్య మిత్రులు

షాద్‌నగర్‌రూరల్: బాల్యంలో ఒకే బడిలో చదువుకున్నారు...ఆ తరువాత ఎక్కడెక్కడో స్థిరపడ్డారు...50ఏళ్ల తరువాత బాల్య మిత్రులు మళ్లీ కలుసుకున్నారు...అందుకు పట్టణంలోని ఠాగూర్ పాఠశాల వేదికై ంది. ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1973–74లో పదవ తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1974–76లో ఇంటర్మీడియట్ చదువుకున్న మిత్రులు ఆదివారం పట్టణంలోని ఠాగూర్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 50సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ, క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్నేళ్ల తరువాత ఒకే వేదికపై కలుసుకొని ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో తీరిక లేకుండా ఎక్కడెక్కడో ఉన్నప్పటికీ 50 ఏళ్ల అనంతరం బాల్య స్నేహితులను కలుసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎన్‌కే.రాజేంద్రప్రసాద్, యెన్నంగోపాల్‌రెడ్డి, సూర్యప్రకాష్, చంద్రమౌళి, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.